# స్వదేశం-స్వర్గలోకం

సుమతి మతిపోయినదానిలా ఇల్లాంతా తిరుగుతోంది. కారణం చేతిలో వున్న ఉత్తరమే. వందన, ప్రవీణ్, పిల్లలిద్దరూ వస్తున్నట్లు రాసిన ఉత్తరం ఆనందంతో ఆమెని ఉక్కిరి బిక్కిరి చేస్తోంది.

వందన తనూ ఒక ఊళ్ళో పెరగడమే కాకుండా, ఒకే స్కూల్లో, ఒకే కాలేజీలో చదువుకున్నారు. చదువులు పూర్తి కాగానే యిద్దరికీ పెళ్ళయి సంసారాల్లో స్థిరపడ్డారు. వందన భర్త సైంటిస్టు. పెళ్ళవగానే భర్తతో అమెరికాకి వెళ్ళి పదేళ్ళ పైనే అయింది. ఇద్దరు పిల్లలు. సుమతి భర్త జూనియర్ కాలేజీలో లెక్చరరు. ఉంటున్నది పెద్ద పట్టణం కాదు.

సుమతీ, వందనా పెళ్ళిళ్ళయి దూరాల్లో వుంటున్నప్పటికీ స్నేహాన్ని మరువకుండా, నెలకో, రెండు నెలలకో ఓ ఉత్తరం రాసుకునే వారు. వందన అమెరికా విశేషాలతో ఉత్తరం రాస్తే ఎంతో ఆనందపడిపోయి, తన ఊరి విశేషాలు సుమతీ రాసేది.

పదేళ్ళ తరువాత వందనను కలవబోతోంది. అదీ కుటుంబంతో. వాళ్ళు హైదరాబాద్ వచ్చి అక్కడి నుంచి కారులో తమని చూడ్డానికి వస్తామనీ, పిల్లలకు మన పల్లె ప్రాంతాలు చూపించాలనీ రాయడంతో సుమతికి హడావిడిగా వుంది.

పదేళ్ళ క్రితం మన దేశాన్ని వదిలేసిన వందన, కుటుంబాన్ని ఎలా రిసీవ్ చేసుకోవాలన్న ఆలోచనతోపాటు, వాళ్ళున్న మూడు రోజులూ వాళ్ళనెలా చూడాలన్న ఆలోచనలు బుర్రని తినేస్తున్నాయి. "అమెరికాలో వాళ్ళకుండే సదుపాయాలు వేరు, ఇక్కడ మన ఇళ్ళూ, పన్లూ చూస్తే ఎలా ఫీలవుతారో! వాళ్ళ బాత్‌రూంల గురించి రాసింది తల్చుకుంటేనే మనకి సిగ్గుగా వుంటుంది. మన బాత్‌రూంలో వాళ్ళెలా స్నానాలు చేస్తారో! అక్కడ బాత్ టబ్బులూ వగైరాలు, మన వంటలు తింటారో తినరో, ఏం తింటారో! కారాలు తినడం అలవాటు తప్పిపోయి వుంటుంది" ఇలా ఉత్తరం వచ్చింది మొదలు వాళ్ళ గురించే ఆలోచన. వాళ్ళనీ, వాళ్ళ హోదానీ, తమతో పోల్చుకుని సిగ్గుపడిపోతోంది.

భర్త కాలేజీ నుంచి రాగానే వందన, కుటుంబం భారతదేశం వస్తున్నారనీ, తమని చూడటానికి కుటుంబంతో వస్తున్నారనీ చెప్పి ఉదయం నుంచి తన మనసులో కలుగుతున్న సంచలనాన్ని చెప్పింది. అంతా విన్న నితిన్ "సుమా! చూడు - రానీ వాళ్ళొస్తే మనకున్న దాంట్లో మనం చేసి పెడతాం. వాళ్ళు అమెరికాలో వున్నారని వాళ్ళ అమెరికా పద్ధతులు

మనకిక్కడ రావు కదా! ఒకరి కోసం మనం మారలేము. ఎవరొచ్చినా మన పద్ధతి మనది" అని అనగానే సుమతికి చాలా కోపం వచ్చింది. "ఒకరి కోసం కాదండీ మనం మాత్రం వాళ్ళ ముందు దర్జాగా వుండొద్దూ? తనెప్పుడు ఉత్తరం రాసినా అమెరికా గురించి ఎంత గొప్పగా రాస్తుందో తెలుసా? అక్కడి పిల్లలకి మట్టి అంటే ఏమిటో తెలీదుట. అంతా సిమ్మెంటుట. అక్కడి సదుపాయాల గురించి రాసింది చదువుతుంటే మతిపోతుంది. అందునా పదేళ్ళ తరువాత వచ్చి 'ఛీ ఛీ ఇదా మనదేశం?' అని నవ్వకూడదు" అంటూ చెప్తున్న భార్యకేం చెప్పీ ప్రయోజనం లేదని వూరుకున్నాడు నితిన్.

పిల్లలు ఇంటికి రాగానే వాళ్ళతో "మనింటికి అమెరికా నుంచీ ఆంటీ, అంకుల్, ఇద్దరు బాబులూ వస్తున్నారు తెలుసా? వాళ్లకి ఇంగ్లీసు తప్ప తెలుగు రాదు. మీరూ వాళ్ళతో ఇంగ్లీషులోనే మాట్లాడాలి. వాళ్ళు మీలా అన్నీ తినరు. వాళ్లకి అన్నీ పెట్టొద్దు. వాళ్ళున్నన్నాళ్ళూ జాగ్రత్తగా వుండండి. వాళ్ళు అమ్మా, నాన్న అని పిలవరు. మమ్మీ అనో, మామ్ అనో అంటారు. మీరు కూడా నన్ను మమ్మీ అని మీ నాన్నని డాడీ అని పిలవండి. మీరూ ఇంగ్లీషు మీడియం స్కూల్లో చదువుతున్నారు కదా! టిఫిన్, అదీ చెమ్చాలతో తినాలి. ఇంకోటి అక్కడి పిల్లలు చెప్పులు లేకుండా ఇంట్లో కూడా తిరగరు. మీకు ఇంట్లో వాడే చెప్పుల జతలు కొంటాను అవి వేసుకుని ఇంట్లో తిరగండి" అని చెప్తుంటే, మధ్యలో పిల్లలు వేసే ప్రశ్నలకి సమాధానాలిస్తూ, అమెరికా గొప్పతనాన్ని వాళ్ళకి చెప్తూ, మనం కూడా వాళ్ళలాగే వుండాలంటూ పిల్లలకు చెప్పసాగింది సుమతి.

ఇంక వాళ్ళు రేపు వస్తారనగానే అమెరికాలో దొరికే కూరలు క్యాబేజీ, కాలీఫ్లవర్, క్యారెట్, బంగాళాదుంపల్లాంటివి తెప్పించి పెట్టింది. కారాలు లేకుండా చిరుతిళ్ళు తయారు చేసి వుంచింది.

మర్నాడు వాళ్ళు రానే వచ్చారు. వచ్చింది మొదలు సుమతి వాళ్ళకి చేసే మర్యాదలు చాలా వ్యత్యాసంగా వున్నాయి. వాళ్ళేం చెయ్యబోయినా "మీకలవాటు లేదోయ్ మీ అమెరికాలో లా మేం మీకు చెయ్యలేమోయ్" అంటూ వాళ్లకి అమెరికా పద్ధతుల ప్రకారం చెయ్యడానికి ప్రయత్నిస్తోంది.

బ్రేక్‌ఫాస్టు టైములో బ్రెడ్డు, జామ్, వెన్న లాంటివి పెట్టింది. భోజనాలప్పుడు రొట్టెలు, ఉడికించినవి, వేయించినవి కూరలు, కారాలు లేకుండా చేసి పెట్టింది.

ఆ రోజంతా సుమతి ప్రవర్తన చూసిన వందన రాత్రి సుమతితో "సుమా! రేపు ఉదయం టిఫిన్ ఏమిటోయ్" అని అడగ్గానే మీకు బ్రెడ్డు అలవాటేమో కదా? ఇంక ఏం చేద్దామన్నా మీరు తింటారో, తినరో అన్న భయంతో చెయ్యడం లేదోయ్" అని అనగానే "సుమా! ఉదయం నుంచీ నీవు మా కోసం తీసుకుంటున్న శ్రమ, తాపత్రయం చూస్తున్నాను. మాకు అక్కడ అలవాటున్నవే చేసి పెట్టాలని చాలా తాపత్రయపడుతున్నావు. నీకో విషయం చెప్పనా! మనం ఆంధ్రులం, మనం ఎక్కడికి వెళ్ళినా మారలేము, మారము. పైగా మనదేశం

వదిలి వెళ్తే మనదేశం మీద అభిమానం, మమకారం ఎక్కువవుతాయి. పైగా మనదేశానికి వచ్చినప్పుడు ఇక్కడి భోజనం చెయ్యాలనీ, ఇక్కడి వంటకాలు పిల్లలకి రుచి చూపించాలనీ, అక్కడ దొరకనివి పెట్టి వాటి గురించి చెప్పాలనీ వుంటుంది. కాబట్టి నువ్వు మా కోసం ఆ బ్రెడ్డూ వగైరాలు కాకుండా లక్షణంగా అట్లూ, పెసరట్లూ, ఉప్మాలాంటి టిఫిన్లు చేసి పెట్టు. భారతదేశం వచ్చామన్న ఆనందాన్ని మిగుల్చు. పిల్లలకి మిఠాయి మినపసున్ని, పూతరేకులు, కాజాల్లాంటివి తెప్పించి పెట్టు. వాటి గురించి మా పిల్లలకి అక్కడ కథలు, కథల్లా చెప్తాము. అవి ఎలాగుంటాయో, తినాలని వాళ్ళూ ఉవ్విళ్ళూరు తున్నారు. మాకు దొరికే వస్తువులతో మమ్మల్ని ఇంకా అమెరికాలో వున్నట్లే చెయ్యకు. చక్కగా మన కారాలూ, మసాలాలతో మన పక్కా ఆంధ్రా భోజనం పెట్టు. దొండకాయ, బీరకాయ, పొట్లకాయలాంటి కూరలు అక్కడ అరుదుగా దొరికే కూరలు చేసి పెట్టు.

నీకింకో విషయం చెప్పనా! మేము విదేశాల్లో వుండి రాజభోగాలనుభవిస్తున్నామని ఇక్కడ మనవాళ్ళు అనుకుంటారు. అక్కడి విషయాలు తెలుసుకుంటే ఆశ్చర్యంగా వుంటుంది. డబ్బులు బాగా వస్తాయి. మనదేశంలో రానంత జీతాలిస్తారు. డబ్బే ముఖ్యం కాదు కదా! ఆ దేశీయులు మనల్ని విదేశీయుల్లాగే చూస్తారు. ఆడపిల్ల ఉన్నవాళ్ళకి ఆ పిల్లలకి వయసొస్తోం దంటేనే తల్లితండ్రుల మనసుల్లో గుబులు. భార్యాభర్తలు ఉద్యోగాలు చేసుకుని ఇంటికొచ్చి ఇంట్లో పని పాటలు చేసుకోవాలి. పనివాళ్ళుండరు. ఏ పని చెయ్యాలన్నా టైమే! బిల్డింగ్‌కి బట్టలు తుక్కునే మిషనుంటే మన కిచ్చిన టైముకెళ్ళి ఉతుక్కోవాలి. బద్ధకిస్తే మన పని అంతే. ఇలాగే టైముల ప్రకారం పన్లతో తల తిరిగిపోయి, పిల్లలతో సరదాగా కాలం గడపడం కుదరదు. శలవు రోజొస్తే బైటినుంచి తెచ్చుకునే సామాన్లు తెచ్చుకుని, కూరలూ, పులుసులూ చేసి పెట్టుకోవాలి. ఫ్రిజ్‌లో పెట్టుకుని రోజూ సాయంకాలాలు ఆ కూరలూ వగైరాలు వేడి చేసుకుని వారం రోజులూ తినడం. మీరేమో చక్కగా ఏ పూట కూర ఆ పూట ఫ్రెష్‌గా తెచ్చుకుని, వండుకుని తింటారు. మేము నిన్నటివీ మొన్నటివీ వేడి చేసుకుని తింటాం. ఏం తోచకపోతే మీరు స్నేహితులెవర్నయినా కలిసి వస్తారు. అక్కడ ఎవరిళ్ళకెళ్ళాలన్నా ఫోన్లు చెయ్యడం, వాళ్ళు ఖాళీగా వున్నారంటే వెళ్ళడం. లేదంటే ఇలా చెప్పా పెట్టకుండా వచ్చారేమిటని వింతగా చూస్తారు. మనదేశంలో ఏ కథా కార్యం జరిగినా, ఎవరికైనా అనారోగ్యంగా వున్నా వెళ్తారు. మేము మంచీ, చెడుకీ దూరమే సుమతీ! మీరేదో మా గురించి చాలా గొప్పగా వూహించుకుంటారు. ఉద్యోగాలు కాంట్రాక్టువి. వాళ్ళకి మన పని నచ్చకపోతే చక్కగా పంపేస్తారు. స్థిరం లేని బ్రతుకులు. అలా అని అన్ని ఉద్యోగాలూ అలాంటివి అనను. కొందరిని చూస్తుంటే జాలేస్తుంది. భారతదేశానికి తిరిగొస్తే ఏం చెయ్యాలిరా అన్న ఆదుర్దా కొందరికి.

కొన్నిదేశాల్లో స్టూడెంట్స్ డబ్బులు చాలక పళ్ళూ కూరలూ అమ్ముకోవడం, హోటళ్ళల్లో కప్పులు కడగడం లాంటివి చేసి డబ్బులు గడించుకుంటారు. ఏ పని చెయ్యడమన్నా తప్పులేదు. కానీ మనవాళ్ళిక్కడ తమ పిల్లల గురించీ, చుట్టాల గురించీ గొప్పగా చెప్పుకుంటారు.

దూరపు కొండలు నునుపన్నట్లు ఉంటుందిక్కడి వాళ్ళకి. కానీ వాళ్ళక్కడ పడే పాట్లు ఎవరికీ తెలీదు. నిజాన్ని తెలుసుకొంటే "అబ్బ మనదేశం మనదేశమే" అనిపిస్తుంది సుమా! పరిస్థితులు ప్రాబల్యానికి అక్కడి నుంచి రాలేక, మనదేశం మీద మమకారాన్ని చంపుకోలేక బ్రతుకుతున్న భారతీయులు విదేశాల్లో అనేకమంది వున్నారు.

రోడ్డు మీద భారతీయులు కనపడగానే ఆనందంగా పరిచయం చేసుకుంటాం. అందులో మన ఆంధ్రులనగానే మరీ ఆనందం పెల్లుబుకుతుంది. తెలుగు రాక పిల్లలు అక్కడ భాష మాట్లాడుతుంటే చెప్పలేని బాధగా వుంటుంది. అదృష్టవశాత్తూ మాకు ఒక తెలుగామె పిల్లల్ని చూడటానికి దొరకడంతో మా పిల్లలకి చక్కటి తెలుగు వచ్చింది. ఆమెతో చెప్పాను, మా పిల్లలతో తెలుగులోనే మాట్లాడమని. మా ప్లిలలు చక్కగా "అమ్మా నాన్నా" అని పిలుస్తుంటే ఎంతో ఆనందంగా వుంటుంది సుమా! అక్కడ ఎన్నో మైళ్ళ దూరంలో వున్న చిన్మయా మిషన్‌కి ఆదివారాలు పిల్లల్ని తీసుకెళ్ళి శ్లోకాలు చెప్పిస్తాము. మన సంస్కృతి, సంస్కారం కోసం అక్కడ మేమెన్నో పాట్లు పడతాం. అక్కడ అన్నీ అసౌకర్యాలే అని అనను. చాలా రకాల సౌకర్యాలూ వున్నాయి. కానీ అక్కడ మంచిని కాకుండా ఆ దేశీయుల్ని అనుకరించి వాళ్ళల్లా మన దేశీయులు కొందరు మారటం దురదృష్టకరం. వాళ్ళ పద్ధతులు వాళ్ళవి. మన పద్ధతులు మనవి. మనదేశంలో లేని సౌఖ్యాలు అక్కడున్నా మనదేశం మనదేశమే సుమతీ! భారతదేశంలో, అందునా ఆంధ్రదేశంలో అడుగెట్టగానే ఎంతో హాయిగా, ఆనందంగా ఊపిరి పీల్చుకున్నాం. కాబట్టి మమ్మల్ని విదేశీయుల్లా చూడక చక్కగా భారతీయుల్లా, అందులో ఆంధ్రుల్లా, నీ చిన్ననాటి స్నేహితురాలిగానే చూడు. ఇక్కడ ఎన్నో ఏళ్ళు పెరిగి వెళ్ళిన వాళ్ళం. మధ్యలో వచ్చిన సిరితో విదేశీయులం అయిపోలేము. పిల్లలకి కూడా మనదేశం గురించి చెప్పాలనీ, చూపించాలనీ తీసుకొచ్చాం. కాబట్టి మా కోసం నీ అలవాట్లు మార్చుకోవద్దు సుమతీ! సొంతదేశం - స్వర్గలోకం. ఎన్నిదేశాలు తిరిగినా మనదేశం మనకి గొప్పది" అంటున్న వందనకేసి వింతగా చూస్తూ, కాస్త సిగ్గుతో తల వంచుకుని, "రేపటి టిఫిన్‌కి పెసరపప్పు నానపోసి వస్తానోయ్" అంటూ లోపలికెళ్ళిన సుమతి పంజాబీ డ్రస్సు మార్చుకుని చీరతో తిరిగి వచ్చింది.

- ప్రియదత్త 23-2-2005